
# చిరంజీవి

సింధు



రేషన్ కార్డు మీద మావారి పేరు కూడ రాయించాలని నేను రేషనింగ్ ఆఫీస్ కెళ్లటమది ఐదోసారి.

ఆయనకి నగరం కొత్త. ఆయనకు సెలవు కూడా ఎక్కువ లేదు. మన ఆఫీసుల సంగతి మనకి తెలిసిందే గనుక ఆ పని భారమేదో నేనే తీసుకున్నాను. లేకపోతే ఆరు రూపాయలు పెట్టి కొనాలి కదా!

వెళ్ళినప్పుడల్లా ఏదో అడ్డంకి వస్తూనే ఉంది. గుమాస్తా లేడని ఒకసారి, నా పని కంటె అర్జంటు పనులున్నాయని ఒకసారి యిలా యేదో చెబుతూ వచ్చారు.

ఆఫీసులో అడుగుపెట్టి గుమాస్తా దగ్గర కెళ్ళి విష్ చేశాను. 'నా పనెంతవరకూ వచ్చిందండీ ?'

క్రొత్తగా చూస్తున్నట్టు 'నావైపోసారి పరికించి చిరునవ్వు ముఖంమీద పులుముకుని "అరరె, ఎంత వెతికినా మీ అప్లికేషన్ కనిపించలేదు. మరోటి రాసివ్వండి" అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. కాని అవసరం నాది కనక నిగ్రహించుకుని "ఎప్పుడిస్తారు?"

'చూడండి మేడమ్ ... అర్జంటు పని చాలా వుందివ్వాళ. మీరు రేపొస్తారి వచ్చారంటే పని పూర్తిచేస్తాను.'

రేపు మీద నాకు నమ్మకం కలగలేదు. లీవ్ సమస్య వుండనేవుంది. అప్లికేషన్ రాసి ఆఫీసర్ని కలవాలని నిశ్చయించుకున్నాను. రాసిన అప్లికేషన్ అతని చేతకివ్వకపోయేటప్పటికి నా ఉద్దేశం గ్రహించాడేమో...

"ఆఫీసరు చాలా బిజీగా ఉన్నారు మేడం. అసలే కోపిష్టి" అన్నాడు.

ఆఫీసరున్న గదివైపు నడిచి బైట బెంచీ మీద కూర్చున్నాను. కొంచెంసేపటికి లోపలి కెళ్ళాను. నమస్కరించి నిలబడ్డాను.

కూర్చోమని చెప్పి "మీరొచ్చిన పని ?" గామ్యంగా అడిగాడు.

ఎలామాట్లాడితే పనవుతుందో మనసులో ఇంతకుముందే ఆలోచించుకున్నాను వచ్చిన పని చెప్పి, చివరగా "సార్! మాటి మాటికి రావాలంటే మాకు లీవ్ దొరకదు" అన్నాను.

అప్లికేషన్ చేతిలోకి తీసుకుంటూ 'మీరు ఎంప్లాయినా ?' అడిగాడు.

'అవును సార్'

'ఎక్కడ వర్క్ చేస్తున్నారు.'

"సెక్రటేరియట్‌లో"

"అలాగా...ఏ సెక్షనులో"

చెప్పాను.

"మావాడొకడు అక్కడే వర్క్ చేస్తున్నాను—పేరుమధుసూదన్.మీకు తెలుసా..." ఆఫీసులో చాలామంది మధుసూదన్‌లు ఉన్నారు. వివరణకోసం అడిగాను 'ఏ సెక్షన్ సార్?'

"ఫైనాన్సు సెక్షననుకుంటాను" అన్నారాయన.

"ఆయన తెలియకపోవటమేమిటండి!చాలా మంచివారు" అన్నాను ప్రశంసాపూర్వకంగా.

ఇందాకటి గుమస్తానే పిలిపించి పని పూర్తిచేసుకురమ్మని చెప్పారు.

విజయగర్వంతోనేనతనివైపుచూస్తుంటే, కొరకొర చూశాడతను నావైపు.

పెన్ను స్టాండులో పెడుతూ "వాడికీ నాకూ ప్రాణస్నేహం" అన్నారు.

"అలాగా సార్"అన్నాను ఏమనాలోతోచక.

ప్యూను వచ్చి యేదో చీటి అందిచ్చాడు. నేనింకా అక్కడెక్కువసేపు కూర్చోవటం బాగుండదని గ్రహించి లేచి నిలబడ్డాను. నమస్కరించి యివతలికొచ్చాను.

మరోగంటలో కార్డు తీసుకుని బయట పడ్డాను. ఆఫీసర్ గారికి,మధుసూదన్‌కి మరోసారి ధన్యవాదాలర్పించాను మనసులోనే.

* * *

మరునాడు ఆఫీసులో మధుసూదన్‌ని కలుసుకుని థాంక్స్ చెప్పాను, "మీ వల్ల నా పని చాలా తొందరగా అయిపోయిందం"టూ.

"నావల్ల అవటమేమిటి ?" అన్నాడాయన విస్మయంగా.

"పోనీ... మీ పేరు వల్లనుకోండి" అని జరిగింది చెప్పాను

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకేం అర్థం గావటంలేదమ్మాయ్." అన్నాడాయన అయోమయంగా

"రేషనింగ్ ఆఫీసర్ రామారావుగారు మీ స్నేహితుడు కాదూ !"

"రేషనింగ్ ఆఫీస్‌లో నాకెవరూ క్లర్కు కూడా తెలియదే?" అన్నాడాయన తెల్లబోతూ.

ఎంతాలోచించినా ఆ స్నేహితుడెవరో గుర్తురాలేదాయనకి. ఈసారి తెల్లబోవటం నావంతయింది. నేనీయన అనుకునే గదా తెలుసని చెప్పింది తెలియదని చెప్పాంటే నా పని అంత తొందరగా అయ్యుండేదికాదేమో... ఒకవేళ ఆయున స్నేహితుడు మధుసూదన్ వేరే సెక్షన్‌కి మారాడేమో? అదాయనకి తెలియదేమో.. పరి పరి విధాల ఆలోచనలు పోతున్నాయి.

మాతోపాటు సుబ్బారావు చేరాడు. అతని కేమీ అర్థంకాలేదు. చివరికొక నిర్ణయాని కొచ్చేసి "పోనీలే ఆయన స్నేహితుడెవరయితే మనకెందుకు ... మీ పని పూర్తయింది. అందుకు సంతోషం" అన్నాడు సుబ్బారావు.

అంతా వింటున్న వనజ మా దగ్గర కొచ్చింది మెల్లగా. వనజ వారం రోజుల క్రితమే చేరింది. ఎక్కువ పరిచయం లేదు. "మీ సంశయం నేను తీరుస్తాను" అంది వనజ. సంభ్రమంగా ఆ వైపు చూశాము.

రామారావుగారు మా నాన్నగారు. మధుసూధన్ మామయ్య ఆయన ప్రాణస్నేహితుడు. రోజూ ఏదో టైంలో కలుసుకుంటూండే వారు. ఆ రోజు సాయంత్రం మా ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న మామయ్య మా యింటికి కొద్ది దూరంలోనే యాక్సిడెంటయి చనిపోయాడక్కడికక్కడే. వార్త విని షాక్ తిన్నాడు నాన్న. కొంత కాలం వరకూ షాక్ నించి తేరుకోలేదు. మామయ్య చనిపోయారంటే ఎవ్వరికీ నమ్మకం కలగలేదు. మా నాన్నగారి దృష్టిలో ఆయనింకా సజీవుడే. ఆయన యిక్కడే పని చేసేవారు."

వింటున్న మా కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి.

# ధర్మపథం

## అవతార పురుషులు అసమర్థులా ?

భగవంతుడు సర్వ వ్యాపకుడు. ఆయన అవతారాలు ఎన్నో ఉన్నవి. వాటిలో దశావతారాలు ఆబాలగోపాలమూ ఎరిగినవి. వీటిలో రామావతారానికీ, కృష్ణావతారానికీ వ్యాప్తి చాలా ఎక్కువ.

రాముడూ, కృష్ణుడూ మానవాతీతాలైన కార్యాలన్నీ సాధించారు. అయినా వారిలో కొంత దౌర్బల్యం కానవస్తున్నదని కొందరు భ్రాంతి పడవచ్చును. సీతాదేవిని రావణుడు ఎత్తుకొని పోగా—ఆమె పర్ణశాలలో కానరాక, ఎంత వెతికినా జాడ లేనందున సామాన్య మానవునివలె వలవల ఏడ్చాడు తనకు గొప్ప శక్తి సామర్థ్యాలున్నా, తానొక్కడే పోయి రావణుని సంహరింప గలిగినా— సుగ్రీవుని సహాయాన్ని కోరాడు. యుద్ధానికి వానర సైన్యం కావలసివచ్చింది. ఈ విధంగానే కృష్ణుడు శత్రువులకు భయపడి సముద్రంలో శత్రుదుర్భేద్యంగా ద్వారకను నిర్మించుకోవలసి వచ్చింది. కాలయవనుడు గొప్ప సేనతో మధుర మీదికి దండెత్తి రాగా, కృష్ణుడు అతనికి దొరకకుండా పారిపోవలసి వచ్చింది. ఇలాటి సంఘటనలవల్ల ఆ అవతార పురుషుల బలహీనత వ్యక్తమవుతున్నది కదా! అనే సందేహం కలగడం సహజమే!

గొప్ప శక్తి సామర్థ్యాలున్నా వారి విధంగా ఎందుకు ప్రవర్తించాలి ?

శ్రీరాముడు, శ్రీకృష్ణుడును ఆమానుష శక్తి సంపన్నులైన అవతార పురుషులైనా, మానవులుగా జన్మించుట వల్ల మానవ ధర్మాలను అనుసరించవలసి ఉంటుంది. మానవులవలెనే పుట్టారుగాని, ఎక్కువ అవయవాలు కలిగియుండలేదు. అందువల్లనే మనుష్యులవలె ప్రవర్తించవలసి వచ్చినది.

తథాపియో మనుష్యాణాం
ధర్మస్త మనువర్తతే,
కుర్వన్ బలవతా సంధిం
హీనైర్యుద్ధం కరోత్యసౌ.

"సామచోప ప్రదానంచ, తథాభేదం చదర్శయన్,
కరోతి దండపాతంచ క్వచిదేవ పలాయనమ్,
మనుష్యదేహినాం చేష్టా మిత్యేవ మనువర్తతే
లీలా జగత్పతే స్తస్య ఛందతః పరివర్తతే."

అని విష్ణు పురాణంలో ఉన్నది.

మనుష్య ధర్మాలను అనుసరించుటవల్ల బలవంతులతో సంధి, బలహీనులపై దాడి, సామ, దాన, భేద, దండోపాయాలవల్ల కార్య సాధన, అవసరమైతే పారిపోవడం ఇవన్నీ మానవుని ధర్మాలు మనుష్య దేహాన్ని ధరించడంవల్ల ఇలాటి వాటిని అనుసరించడం జరుగుతుంది. ఇవన్నీ తాను కోరిన విధంగా ప్రదర్శించే భగవంతుని లీలలు వీటిని బట్టి అవతార పురుషులకు తగిన సామర్థ్యం లేదని సందేహించడం పొరపాటని పైదానివల్ల తెలుస్తున్నది.

— బులుసు వేంకటరమణయ్య

